నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 11 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## బియ్యం ఇయ్యాలే..



రేషన్‌కార్డు ఇస్తున్నట్లు పత్రాలు ఇచ్చారు. బియ్యం ఇవ్వడం లేదు. అలాంటప్పుడు రేషన్‌కార్డులు ఇచ్చి ఏం లాభం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్తగా పత్రాలు ఇచ్చిన వారందరికీ బియ్యం ఇచ్చేలా చూడాలి. రోడ్డు సౌకర్యం లేక మా గూడెం వాసులందరం ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో బయటికి వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తుంది. పైలెట్ గ్రామం చేసిన మా ఊరుకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

*- శాంత, కోలాంగూడ, కొత్తపేట.*



మంచిర్యాల జిల్లా ర్యాలీ గ్రామంలోని పల్లె ప్రకృతివనంలో ఎండిపోతున్న మొక్కలు



కోటపల్లి మండలం బొప్పారంలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

నమస్తే విజిట్ NAMASTE VISIT

# సమస్యల సుడిలో పైలెట్ పల్లెలు

## మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసినా ఫలితం శూన్యం

- ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు.. లోపించిన పారిశుద్ధ్య నిర్వహణ..
- అధ్వాన్నంగా అంతర్గత రహదారులు.. దుర్వాసన వెదజల్లుతున్న డ్రెయినేజీలు..
- మూలనపడ్డ ట్రాక్టర్లు.. ఉపయోగంలో లేని సెగ్రిగేషన్ షెడ్లు..
- నిరుపయోగంగా డంపింగ్ యార్డు, శ్మశాన వాటికలు
- వేసవి దృష్ట్యా బోరు బావులు ఏర్పాటు చేయాలని వేడుకోలు
- అనర్హులను ఎంపిక చేశారంటూ అర్హుల కాంగ్రెస్ సర్కారుపై మండిపాటు
- ఇప్పటికైనా సౌకర్యాలపై సర్కార్ దృష్టి పెట్టాలని కోరుతున్న జనం
- పైలెట్ పల్లెల్లో 'నమస్తే తెలంగాణ' విజిట్

మంచిర్యాల, మార్చి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక గ్రామం చొప్పున పైలెట్ గ్రామాలను ఎంపిక చేసి వంద శాతం పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభావిత, లబ్ధిదారులు తక్కువ సంఖ్యలో ఉండే చిన్న గ్రామాలను ఎంపిక చేసి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పుకుంటుంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా సర్కారు ఎంపిక చేసిన పైలెట్ గ్రామాలు సమస్యల విలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అమలు చేయాల్సిన పథకాలు ఏమో గానీ కనీస సదుపాయాలు కల్పించకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. కొన్ని పైలెట్ గ్రామాల్లో అంతర్గత రోడ్లు, రాకపోకలు సాగించేందుకు సరైన రహదారులు లేవు. ఇక గతంలో కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు పూర్తిగా ఎండిపోయాయి. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గ్రామ పంచాయతీలకు ఇచ్చిన ట్రాక్టర్లు నడిపే పరిస్థితి లేక పలు గ్రామాల్లో మూలన పడ్డాయి. చెత్త సెగ్రిగేషన్ షెడ్లు ఉపయోగంలో లేవు. పారిశుధ్య నిర్వహణ అసలే లేక అధ్వానపు పరిస్థితులు నెలకున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం 'నమస్తే తెలంగాణ' విజిట్‌లో దాదాపు అన్ని పైలెట్ గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులే కనిపించాయి.

కోటపల్లి మండలం బొప్పారంలో డంపింగ్ యార్డు పరిస్థితి





భీమారం మండలం దాన్పూర్‌లోని పల్లె ప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు



కోటపల్లి మండలం బొప్పారంలో గ్రామ పంచాయితీ ట్రాక్టర్ పని చేయకపోవడంతో మూలన పడిన ట్రాలీ

### శత శాతం.. అగమ్య గోచరం..

రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన మేరకు రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ పైలెట్ గ్రామాల్లో 100 శాతం అమలు కావాలి. చాలా గ్రామాల్లో ఎంత మందికి వచ్చిందనే వివరాలు అధికారులు చెప్పలేకపోతున్నారు. మరోవైపు అర్హులైన వారిని కాదని తమకు కావాల్సిన వారినే ఎంపిక చేశారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. కాసిపేట మండలంలో పైలెట్ గ్రామమైన బుగ్గగూడెంలో ట్రాలీ ఉందని చెప్పి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేయలేదని ఓ మహిళ వాపోయారు. డ్వాక్రా ఋణం తీసుకుని ట్రాలీ నడుపుకుంటూ గూన ఇంట్లో ఉండే తాము ఇంటికి ఎలా అర్హులమయ్యాయో, పక్కా ఇల్లు, ట్రాలీ ఉన్నవారు ఇందిరమ్మ ఇంటికి ఎలా ఎంపికయ్యారో చెప్పాలంటూ సదరు మహిళ వాపోయింది. కోటపల్లి మండలంలోని బొప్పారం గ్రామంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మాణం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయితీ ట్రాక్టర్ రిపేర్ వచ్చి మూలకు పడిపోగా ఆ ట్రాక్టర్ రిపేర్ షెడ్డుకు చేరి సంవత్సరాలు దాటుతున్న పట్టించుకునేవారు లేకుండా పోయారు. దీంతో ఆ ట్రాక్టర్ ఎందుకు పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీ ట్రాలీ కూడా రోడ్డు పక్కన పడిపోయి నిరుపయోగంగా మారింది. డంపింగ్ యార్డు కొన్ని నెలలుగా వినియోగంలో లేక బీటలు వారి శిథిలావస్థకు చేరింది. జన్నారం మండలంలో కొత్తపేట గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్లు కూడా లేవు. రేషన్ కార్డులకు ఎంపిక చేసిన వారికి ఇప్పటిదాకా బియ్యం సరఫరా చేయలేదని లబ్ధిదారులు చెప్తున్నారు. గ్రామంలోని డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక నిరుపయోగంగా మారాయి. వేసవి నేపథ్యంలో గ్రామంలో తాగునీటికి ఇబ్బంది అవుతుందని, ఇప్పుడున్న బోరుకు అదనంగా మరో బోరు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇలా పైలెట్ గ్రామాలనే కాకుండా దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

### గూన పెంకుల ఇంట్లో ఉంటున్నా.. ఎంపిక చేయలేదు..

మా ఊరును పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కావాలని మేము దరఖాస్తు చేసుకున్నాం. నేను గూన పెంకుల ఇంట్లో ఉంటున్న మాకు ట్రాలీ ఉందని ఇందిరమ్మ ఇంటికి ఎంపిక చేయలేదు. ఆ ట్రాలీ కూడా డ్వాక్రా ఋణం తీసుకుని కొనుకున్నా. అలాంటప్పుడు మేము ఎలా అనర్హులం అవుతాం. మా ఇంటిని మీరే చూడండి. మాకు ఇల్లు ఇవ్వకుండా పక్కా ఇండ్లు, సొంత ట్రాలీలు ఉన్నోళ్లను ఎంపిక చేశారు. లబ్ధిదారుల ఎంపిక సరిగా జరగలేదు. మాలాంటి వారికి న్యాయం చేయాలి.

*- భీమిని రాజేశ్వరి, బుగ్గగూడెం.*





మంచిర్యాల గోదావరిలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

## గ్రూప్-1లో అర్హత సాధించిన సింగరేణి కార్మికుడి బిడ్డ



రిక్కుల సత్యనారాయణ రెడ్డి

సీసీసీ నస్పూర్, మార్చి 10: టీఎస్‌పీఎస్సీ సోమవారం గ్రూప్-1 ఫలితాలు విడుదల చేయగా, సీసీసీ నస్పూర్‌కు చెందిన సింగరేణి కార్మికుడి కుమారుడు రిక్కుల సత్యనారాయణరెడ్డి క్వాలిఫై అయ్యాడు. న్యూ నాగార్జున కాలనీలో నివాసముంటున్న సత్యనారాయణ రెడ్డి తండ్రి చంద్రారెడ్డి సీసీసీ నస్పూర్ ఏరియాలోని వర్క్‌షాప్‌లో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. తల్లి అంజలి గృహిణి. సత్యనారాయణరెడ్డి స్థానిక మార్టిన్ గ్రామర్ పాఠశాలలో 8వ తరగతి వరకు చదివాడు. 9,10 తరగతులు వరంగల్‌లోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో పూర్తి చేశాడు. ఆపై హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివాడు. అనంతరం హైదరాబాద్‌లో సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. అది సాధ్యం కాకపోవడంతో గ్రూప్స్‌పై దృష్టి పెట్టాడు. 2022 నుంచి హైదరాబాద్‌లోనే ఉంటూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా సొంతంగా కష్టపడి చదివి గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు రాశాడు. సోమవారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 900 మార్కులకుగాను 420 మార్కులు సాధించి క్వాలిఫై అయ్యాడు. సత్యనారాయణ రెడ్డి అర్హత సాధించడంపై అతడి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## రామగుండం సీపీగా బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝూ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝూ

మంచిర్యాల అర్బన్, మార్చి 10 : రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సీపీగా అంబర్ కిషోర్ ఝూ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పాగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. సీపీ మాట్లాడుతూ రామగుండం కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు 24 గంటల పాటు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని, చట్ట పరిధిలో సామాన్యులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

## జంక్షన్‌ల కూల్చివేతలపై బీఆర్ఎస్ ఆగ్రహం

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో రాస్తారోకో
- పోలీసులు, నాయకులకు మధ్య తోపులాట..పరిస్థితి ఉద్రిక్తం
- ఎమ్మెల్యే పీఎస్సార్ కావాలనే చేస్తున్నాడన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మార్చి 10 : మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి లక్ష్మీటాకీసు చౌరస్తా వరకు కేసీఆర్ సర్కారులో రూ. నాలుగు కోట్లతో నిర్మించిన నాలుగు జంక్షన్‌లను కుదింపు పేరిట కూల్చివేస్తున్న కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసింది. ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నలిచిపోగా, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావుతో పాటు బీఆర్ఎస్ నాయకులను రాస్తారోకో విరమించాల్సిందిగా పట్టణ సీఐ ప్రమోద్‌రావు కోరారు. ఇందుకు వారు నిరాకరించడంతో పోలీసులంతా వారిని పక్కకు తప్పించేందుకు ప్రయత్నించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు-పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. రోడ్డుపై నుంచి ఎలాగైనా వారిని తొలగించాలని పోలీసులు, అసలు కదిలేదు లేదని బీఆర్ఎస్ నాయకులు పట్టుబట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో సివిల్ డ్రెస్‌లో ఉన్న ఐడీపార్టీ కానిస్టేబుల్ లక్ష్మణ్ రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విజిత్‌రావును బలవంతంగా లాగేందుకు యత్నించాడు. దీంతో అసలు ఇతను ఎవరంటూ విజిత్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు కానిస్టేబుల్ లక్ష్మణ్‌ను పట్టుకుని పోలీసులకు పట్టించాలని ప్రయత్నించారు. కాసేపు వాదోపవాదాలు జరిగాయి. చివరకు అక్కడున్న పోలీసులు అతను ఐడీ పార్టీ కానిస్టేబుల్ అని తెలిపారు. సివిల్ డ్రెస్‌లో ఉన్న వ్యక్తి ఇందులోకి ఎలా వస్తాడని, అసలు ఇక్కడ పరిస్థితులు వేరేగా ఉన్న క్రమంలో అనుమానించాల్సి వస్తుందని విజిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఒక వైపు, విజిత్‌రావు మరోవైపు తమ శ్రేణులతో కలిసి దూసుకువెళ్లడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. అనంతరం రాస్తారోకో విరమించిన బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులను స్థానిక ఎమ్మెల్యే పీఎస్సార్ కావాలనే కూల్చివేస్తున్నాడని, ఆయన గెలిచినప్పటి నుంచి ఎన్ని ప్రమాదాలు జరిగాయో లెక్క తీయాలని సవాల్ విసిరారు. అంబేద్కర్ చౌరస్తాలో చుట్టూ రాజ్యాంగానికి సంబంధించిన చిహ్నాలు, రాజ్యాంగ పుస్తకం, జాతీయ జెండాలోని చిహ్నం, తదితర లోగోలను రెయిలింగ్‌లో పొందుపరిచామని అన్నారు. వాటిని కూడా ఇష్టారాజ్యంగా జేసీబీతో కూల్చివేస్తున్నారని అన్నారు. దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ జంక్షన్‌ను కూల్చుతుంటే అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారని అన్నారు. రోడ్డు వెడల్పు పనులకు తాము వ్యతిరేకం కాదని, కానీ గతంలో చేసిన అభివృద్ధి పనులను ధ్వంసం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, ఐసీడీఎస్ మాజీ ఆర్గనైజర్ అత్తి సరోజ, అన్నపూర్ణ, గాదెసత్యం, అంకం నరేశ్, తోట తిరుపతి, శ్రీపతి వాసు, ఎర్రం తిరుపతి, మందపల్లి శ్రీనివాస్, అక్కూరి సుబ్బయ్య, మొగిలి శ్రీనివాస్, కాటంరాజు, తాజుద్దీన్, పెంట ప్రదీప్, రమేశ్‌యదవ్, మధు, తదితరులు పాల్గొన్నారు.



రెయిలింగ్‌ను కూల్చివేస్తున్న జేసీబీ



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పక్కకు తప్పిస్తున్న పోలీసులు

## ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

హాజీపూర్, మార్చి 10 : ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం వేంపల్లి గ్రామ శివారులో గల ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. అనంతరం ముల్కల్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిష్టర్లు, హాజరుపట్టికను పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని, కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి వార్డులు, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, వేసవిని దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించాలన్నారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు.



ముల్కల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

## మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జిని రద్దు చేయడం దుర్మార్గం

### 18 కిలోమీటర్ల దూరం తగ్గే బ్రిడ్జికి రూ. 164 కోట్లు

- కేవలం 5 కిలోమీటర్లు తగ్గే బ్రిడ్జికేమో రూ. 450 కోట్లా?
- ఎమ్మెల్యే పీఎస్సార్ మంచిర్యాలపై కక్ష పెట్టుకుని మొండిగా వ్యవహరిస్తున్నాడు
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఫైర్
- గోదావరిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన

మంచిర్యాలటౌన్, మార్చి 10 : మంచిర్యాల-అంతర్గాంల మధ్య గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన బ్రిడ్జిని రద్దుచేసి, ఆ నిధులను వేరే పనులకు అప్పగించడం దుర్మార్గమైన చర్య అని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి గోదావరి నదిలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రదేశంలో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. బ్రిడ్జి పనుల రద్దు విషయంలో ఎమ్మెల్యే పీఎస్సార్ తన అధికార పలుకుబడిని ఉపయోగించారని, దాంతోనే ఇక్కడ నిర్మించాల్సిన బ్రిడ్జిని రద్దు చేశారని మండిపడ్డారు. ముందు నుంచి మంచిర్యాలపై ఎమ్మెల్యేపై కక్ష పెంచుకున్నారని, అందుకే ఇక్కడ అభివృద్ధి పనులను అడ్డుకుంటూ వస్తున్నాడన్నారు. మంచిర్యాల - అంతర్గాంల మధ్య గోదావరినదిపై వంతెనను నిర్మిస్తే కేవలం రూ. 164 కోట్లతో పూర్తవుతుందని, ఇరుపక్కలా ఇప్పటికే రోడ్లు పూర్తయి ఉన్నాయని, ఈ వంతెన పూర్తయితే పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్‌లకు వెళ్లి, తిరిగి వచ్చే వారికి 36 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని అన్నారు. ఒక వైపు ప్రయాణం చేసినా 18 కిలోమీటర్లు తగ్గుతుందన్నారు. కానీ, ఎమ్మెల్యే పీఎస్సార్ మొండిగా వ్యవహరిస్తు ముల్కల, ముర్మూర్ మీదుగా నిర్మించాలనుకుంటున్న వంతెన ద్వారా కేవలం ఐదు కిలోమీటర్ల దూరం మాత్రమే తగ్గుతుందని, పైగా నిర్మాణ వ్యయం రూ. 450 కోట్లు అవుతుందని అన్నారు. మంచిర్యాల - అంతర్గాంల మధ్య ఇప్పటికే టెండర్ అగ్రిమెంట్, సాయిల్‌టెస్ట్‌లు పూర్తయి ఉన్నాయని, పెద్దగా భూసేకరణ చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కానీ ముల్కల, ముర్మూర్ మధ్య నిర్మించాల్సిన వంతెన ఇంకా ప్రతిపాదనల్లోనే ఉందని, భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని, దీని ద్వారా ప్రజలకు పెద్దగా ఉపయోగం ఉండదన్నారు. ప్రభుత్వం స్పందించి నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు అవతలి పక్కనున్న పెద్దపల్లి జిల్లా ప్రజానీకం కోరుకుంటున్న విధంగా ప్రభుత్వం, పాలకులు పనిచేయాల్సిన అవసరం ఉన్నదని, ప్రజల ఇష్టాలతో పనిలేకుండా తమకు నచ్చిన విధంగా చేసుకోవడం సబబుకాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, ఐసీడీఎస్ మాజీ ఆర్గనైజర్ అత్తి సరోజ, అన్నపూర్ణ, గాదెసత్యం, అంకం నరేశ్, తోట తిరుపతి, శ్రీపతి వాసు, ఎర్రం తిరుపతి, మందపల్లి శ్రీనివాస్, అక్కూరి సుబ్బయ్య, మొగిలి శ్రీనివాస్, కాటంరాజు, తాజుద్దీన్, పెంట ప్రదీప్, రమేశ్‌యాదవ్, మధు పాల్గొన్నారు.